



సిద్దిపేట పట్టణంలోని హెడ్‌పోస్టాఫీసు వద్ద ఏర్పాటు చేసిన మార్నింగ్ ఫ్రూట్స్ స్టాల్, వివిధ రకాల ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్

# ఆరోగ్యమే.. మహాభాగ్యం

**ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్‌లో పోషకాలు మెండు**



- 16 రకాలకు సంబంధించి ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్ విక్రయిస్తూ ఉపాధి పొందుతున్న చిరువ్యాపారి

సిద్దిపేట కమాన్, డిసెంబర్ 16: ఆరోగ్యమే మహాభాగ్యం.. మంచి ఆరోగ్యానికి మించినది లేదు.. మనం తీసుకునే పోషకాల ఆహారమే మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. సిద్దిపేటలోని హెడ్ పోస్టాఫీసు వద్ద ఓ చిరువ్యాపారి 16 రకాలకు సంబంధించి ఎన్నో పోషక విలువలు గల ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్ కేవలం రూ.40కే విక్రయిస్తూ ఉపాధి పొందుతు న్నాడు. నిత్యం పట్టణ ప్రజలతో పాటు వాకర్స్, విద్యార్థులకు పోషకాల ఆహారాన్ని అందిస్తూ సమాజహితానికి పాటుపడుతున్నాడు.

### మెదక్ రోడ్డులో...

ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మార్నింగ్ ఫ్రూట్స్ పేరుతో సిద్దిపేట పట్టణంలోని మెదక్ రోడ్డులో ఓ చిరువ్యాపారి 16 రకాల ఫ్రూట్స్ వాటర్ మిలన్, బొప్పాయి, పైనాపిల్, జామ, బీట్‌రూట్, క్యారెట్, డ్రాగన్ ఫ్రూట్, కీర దోస, కర్జురా, దానిమ్మ, బాదం, కాజు, కిస్‌మిస్, సన్‌ఫ్లవర్ సీడ్స్, తేనె, ద్రాక్ష కేవలం రూ.40కే అందజేస్తున్నాడు. ఇక్కడ టేస్టు చేసిన వారు చాలా బాగుందని.. ఉదయమే ఆయిల్ ఫుడ్ ఇతర జంకు ఫుడ్ కంటే ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలంటున్నారు. ఉదయాన్నే వాకింగ్ చేసే వారంతా ఇక్కడ మార్నింగ్ ఫ్రూట్స్‌కు అలవాటుపడిపోయారు. రకరకాల టిఫిన్స్ చేసే బదులు 16 రకాలకు సంబంధించి అన్ని పోషకాలు మార్నింగ్ ఫ్రూట్స్ ఉదయమే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు పార్సిల్స్ తీసుకువెళ్తున్నారు. విద్యార్థులు కూడా వీటిని ఇష్టంగా తింటున్నారు.

### ప్రజల ఆరోగ్యానికే..



లాభాపేక్ష లేకుండా మార్నింగ్ ఫ్రూట్స్ పేరుతో చిరువ్యాపారం చేస్తున్నా. 16 రకాలకు సంబంధించి పోషకాలు గల ఫ్రూట్స్ అందిస్తున్నా. కొనుగోలు చేసిన ప్రజలు చాలా బాగున్నాయంటూ అభినందిస్తున్నారు. మంచి నిర్ణయం తీసుకున్నావని ప్రోత్సహిస్తున్నారు. వ్యాపారం బాగానే ఉంది. – సాయికిరణ్, చిరువ్యాపారి, సిద్దిపేట

### ఆరోగ్యానికి మంచిదని



ఉదయమే పండ్లు, డ్రై ఫ్రూట్స్ తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిది. అన్ని రకాల పండ్లు వస్తున్నాయి. టిఫిన్స్‌కు బదులు పండ్లు తీసుకోవాలి. రుచి కూడా బాగుంటున్నాయి. ప్రజల కోసం ఇక్కడ దుకాణం ఏర్పాటు చేయడం సంతోషం.



– రంజిత్‌కుమార్, వినియోగదారుడు

### రోజూ వస్తుంటా



టిఫిన్స్ తినే బదులు రోజూ పొద్దున్నే పండ్లు తింటున్నా. ఏ పండ్లు కొన్నా ప్రస్తుతం 50 రూపాయలకుపైనే ఉంటాయి. కానీ 16 రకాల పండ్లు ఒకేచోట రూ.40 లభించడం సంతోషంగా ఉంది. నేను తినడమే కాకుండా కుటుంబీకులకు తీసుకువెళ్తున్నా. ఆరోగ్యంగా ఉండడానికి పండ్లు ఎంతో మేలు చేస్తాయి.

– కె. చంద్రం, వినియోగదారుడు

# వేరుశనగ సాగు.. బహు బాగు



**నూనె గింజల పంటల్లోనూ ప్రత్యేక స్థానం..**

**ఆరుతడి పంటల్లో మేటి.. వేరుశనగ**

- 'వరి'కి ప్రత్యామ్నాయంగా రైతుల దృష్టి
- మేలైన విత్తనాలు ఎంచుకొని.. సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక లాభాలు
- మార్కెట్‌లోనూ వేరుశనగకు మంచి డిమాండ్

హుస్నాబాద్, డిసెంబర్ 16: ఆరుతడి పంటల్లో వేరుశనగ పంట(పల్లి కాయ) ప్రధాన మైనదిగా చెప్పొచ్చు. నూనె గింజల పంటల్లోనూ వేరుశనగకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రస్తుతం పల్లి నూనెకు ఉన్న గిరాకీ అంతా ఇంతా కాదు. మార్కెట్‌లో పల్లి నూనెకు ఉన్న గిరాకీని దృష్టిలో ఉంచుకొని యాసంగిలో వేరుశనగ పంటను సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయని వ్యవసాయాధికారులు, ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో వేరుశనగ పంటను సాగు చేసుకునేందుకు అనువైన భూములు ఉన్నాయి. ఇసుకతో కలిపి ఉన్న భూములతో పాటు ఎర్రచెల్క భూములు అధికంగా ఉన్నాయి. జిల్లాలో వరి పంటకు ప్రత్యామ్నాయంగా వేరుశనగ పంటను సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఆరుతడి పంటలను సాగు చేయాలని ప్రభుత్వాలు సూచిస్తున్న తరుణంలో రైతులు ఈ పంటను సాగు చేసేందుకు ముందుకొస్తున్నారు.

### విత్తనాల ఎంపిక... విత్తుకునే విధానం

యాసంగి సీజన్‌లో వేరుశనగ పంట సాగు కోసం మొదట నాణ్యమైన విత్తన రకాలను రైతులు ఎంచుకోవాలి. ఇందులో రెండు రకాలు విత్తనాలు ఉంటాయి. స్పానిష్ గుర్తి రకాలు, వర్జీనియా గుత్తి రకాలు. స్పానిష్ రకాల్లో కదిరి–6, కదిరి–9, అనంత, కదిరి హరితాంధ్ర, ఐసీజీవీ–91114, ధరణి, టీఏజీ–24రకాల విత్తనాలు ఉన్నాయి. వర్జీనియా రకాల్లో కదిరి–7, కదిరి–8 బోల్డ్ రకాల విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఇసుకతో కూడిన గరపనేలలు, నీరు త్వరగా ఇంకిపోయే ఎర్ర చెల్క నేలలు ఈ పంటకు అనువుగా ఉంటాయి. బంకమన్ను, నల్లరేగడి భూములు ఈ పంటకు అనుకూలం కాదు. విత్తుకునే సమయంలో యాసంగి సీజన్ కావడంతో ఒక చదరపు మీటరుకు 44మొక్కలు ఉండేలా చూసుకోవాలి. విత్తనాలను 5సెం.మీటర్ల లోతుకంటే ఎక్కువ లోతులో వేయకూడదు.



హుస్నాబాద్ మండలంలో సాగు చేసిన వేరుశనగర పంట

### ఎరువులు... యాజమాన్య పద్ధతులు

వేరుశనగ పంట వేసే ముందు భూసార పరీక్ష చేయించుకుంటే అందుకు అనుగుణంగా ఎరువులను వాడుకునే అవకాశం ఉంటుంది. దుక్కిలో 3నుంచి 4టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. ఎకరానికి 100కిలోల సూపర్ పాస్ఫేట్, 33కిలోల పొటాష్, 18కిలోల యూరియాను విత్తనాలు వేసే సమయంలోనే వాడాలి. 30రోజుల తర్వాత తొలి పూత దశలో మరో 10నుంచి 15కిలోల యూరియా వేసుకోవాలి. ఊడలు దిగే సమయంలో ఎకరానికి 200కిలోల జిప్సమ్‌ను మొక్క మొదళ్ల దగ్గర వేసి మట్టితో కప్పాలి. జింక్ లోపంతో ఆకుల చిన్నవిగా మారుతాయి. ఇందుకు ఎకరాకు 400గ్రాముల జింక్‌సల్ఫేట్‌ను 200లీటర్ల నీటితో కలిపి వారం రోజుల్లో రెండుసార్లు పంటపై పిచికారీ చేయాలి. ధాతు లోపంతో ఆకులు పసుపు పచ్చగాను, ఆ తర్వాత తెలుపు రంగుకు మారే ప్రమాదం ఉన్నందున ఎకరాకు కిలో అన్నబేధి, 200గ్రాముల సెట్రిక్ ఆమ్లం 200లీటర్ల నీటితో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. కలుపు గడ్డి నివారణ కోసం విత్తనాలు విత్తిన వెంటనే లేదా 48గంటల లోపు అలాక్లోర్ 50శాతం ఇసీ 1.5 నుంచి 2లీటర్ల మందును 200లీటర్ల నీటితో కలిపి దుక్కిపై పిచికారీ చేయాలి.

### 'వరి' కంటే వేరుశనగ పంట సాగే లాభదాయకం...

ఒక ఎకరంలో వరి పంట సాగు చేసేకంటే పల్లిపంటను సాగు చేయడం ఎంతో లాభదాయకం. ఒక ఎకరం పల్లికాయ పంట సాగుచేసేందుకు సుమారు రూ.15వేలు అవుతుంది. ఎకరానికి సగటున 10క్వింటాళ్ల పల్లికాయ పండుతుంది. ప్రభుత్వం క్వింటాల్ పల్లికాయకు రూ.5,550 మద్దతు ధర ఇస్తున్నప్పటికీ ప్రస్తుతం మార్కెట్‌లో రూ.7వేల నుంచి 9వేల వరకు ధర పలుకుతోంది. సగటున క్వింటాల్ ధర రూ.6,500లు వచ్చినా రైతుకు ఎకరాకు రూ.65వేల ఆదాయం వస్తుంది. పెట్టుబడి పోను రైతుకు ఎకరాకు రూ.50వేలు మిగిలే అవకాశం ఉంది. ఎకరం వరి పంట సాగు చేసేందుకు కనీసం రూ.20వేల పెట్టుబడి అవుతుంది. సగటున ఎకరాకు 26క్వింటాళ్ల వడ్లు పండుతాయి. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం క్వింటాల్‌కు రూ.1,940లు ఉంది. ఎకరం వరి సాగు చేసిన రైతుకు రూ.50,440ల ఆదాయం వస్తుంది. పెట్టుబడి రూ.20వేలు పోను ఎకరాకు రైతుకు మిగిలేది కేవలం రూ.30,440లు మాత్రమే. ఒక ఎకరం వరి సాగు చేసేందుకు వినియోగించే నీటితో మూడెకరాల వేరుశనగ పంటను సాగు చేసుకోవచ్చు.

### తెగుళ్ల నివారణకు చర్యలు

వేరుశనగ పంటకు అనేక రకాల పురుగులు, తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది. ఇందులో ముఖ్యమైనవి వేరు పురుగు, ఆకు ముడత పురుగు, పొగాకు లద్దె పురుగు, శనగ పచ్చ పురుగు, తామర పురుగు, పచ్చ దీపపు పురుగు, మొగ్గ తొలుచు పురుగు, తాక్కా ఆకుమచ్చ తెగులు, మొదలు కుళ్లు తెగులు, వేరుకుళ్లు తెగులు, కాండం కుళ్లు తెగులు, మొవ్వ కుళ్లు తెగులు, కుంకుమ తెగులు ఎక్కువగా పంటకు ఆశిస్తాయి. తెగులు లక్షణాలను ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులకు చెప్పినట్లయితే అందుకు తగిన సస్యరక్షణ చర్యలను వివరిస్తారు. అవసరమైతే వ్యవసాయ అధికారులచే క్షేత్ర పర్యటన చేయించడం ద్వారా సస్యరక్షణ చర్యలను తెలుసుకునే అవకాశం ఉంది.

### విత్తన రకాలు... వచ్చే దిగుబడులు



విత్తన రకాలను బట్టి పంట దిగుబడులు వస్తాయని అధికారులు చెబుతున్నారు. కదిరి–6విత్తన రకంతో యాసంగిలో ఎకరాకు 12 నుంచి 14క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. కదిరి–9 విత్తనం సాగు చేస్తే ఎకరాకు 10నుంచి 12క్వింటాళ్లు, కదిరి హరితాంధ్ర ద్వారా 10నుంచి 12క్వింటాళ్లు, ధరణి ద్వారా 9నుంచి 10క్వింటాళ్లు, టీఏజీ–24ద్వారా 8నుంచి 10క్వింటాళ్లు, జేఎల్–24ద్వారా 10నుంచి 11క్వింటాళ్లు, ఐసీజీవీ–91114 ద్వారా 10నుంచి 12క్వింటాళ్లు, కదిరి–7,8 ద్వారా 12నుంచి 14క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇటీవల కొత్తగా వచ్చిన కదిరి లేపాక్షి–1812 రకం విత్తనంతో ఎకరానికి 15నుంచి 18క్వింటాళ్ల దిగుబడి కూడా వస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### కొత్తరకం విత్తనంతో దిగుబడులు పెరిగాయి



రాయలసీమ ప్రాంతం నుంచి ఇటీవల దిగుమతి చేసుకున్న కొత్తరకం విత్తనం కదిరి లేపాక్షి–1812రకం విత్తనం సాగు చేసిన రైతులకు దిగుబడులు పెరిగాయి. ఈ మధ్య కాలంలో ఎక్కువ మంది రైతులు ఇదే విత్తన రకాన్ని వాడుతున్నారు. ఇంతకు ముందున్న విత్తన రకాల ద్వారా కూడా మంచి దిగుబడులు పొందే అవకాశం ఉంది. యాసంగి సీజన్‌లో వరిపంట సాగు చేసే కంటే వేరుశనగ సాగు చేసుకోవడం ఎంతో ఉత్తమం. – నాగరాజు, మండల వ్యవసాయాధికారి, హుస్నాబాద్

### వేరుశనగ పంట సాగుతో మంచి లాభాలు



ప్రభుత్వం వరిపంటకు బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచిస్తున్నందున రైతులు వేరుశనగర పంటను సాగు చేసుకోవడం మంచిది. ఇందులో మంచి విత్తన రకాన్ని ఎంచుకొని సాగు చేసినట్లయితే లాభాలు వస్తాయి. వానకాలంలో నేను రెండు ఎకరాల పంట వేసి మంచి లాభాలు పొందాను. ఇప్పుడు ఐదు ఎకరాల్లో పల్లి సాగు చేస్తున్నా. రైతులు ఈ పంటపైనే దృష్టిసారించి యాసంగిలో లాభాలు పొందాలని ఆశిస్తున్నా. – తిరుపతిరెడ్డి, రైతు, మీర్జాపూర్, హుస్నాబాద్ మండలం

# లక్ష్యం దిశగా..

**మెదక్ జిల్లాలో ముమ్మరంగా పంచాయతీ పన్నుల వసూళ్లు**

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం టార్గెట్ రూ.11.01 కోట్లు
- ఇప్పటివరకు వసూలైంది రూ.7 కోట్ల 74 లక్షలు
- రూ.3.27 కోట్లు పెండింగ్
- జిల్లా వ్యాప్తంగా 70.29 శాతం నమోదు
- లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారుల ప్రత్యేక కార్యాచరణ
- ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



మెదక్ జిల్లాలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

మెదక్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో పంచాయతీ పన్ను వసూళ్లు లక్ష్యం దిశగా సాగుతున్నది. మార్చి 31 వరకు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఇంటింటికీ వెళ్లి పన్ను వసూళ్లు చేపడుతున్నారు. మెదక్ జిల్లాలో 2023–24 సంవత్సరానికి సంబంధించి రూ.11.01 కోట్లు టార్గెట్‌గా నిర్ణయించగా, ఇప్పటి వరకు రూ.7.74 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.3.27 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మార్చి నెలాఖరు వరకు వంద శాతం టార్గెట్ పూర్తి చేస్తామని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా వెల్లడించారు.

### మెదక్ జిల్లా లక్ష్యం రూ.11.01 కోట్లు..

జిల్లాలో వంద శాతం పన్నుల వసూలు పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మొత్తం 21 మండలాల్లో రూ.11.01 కోట్లు టార్గెట్ ఉండగా, ఇప్పటివరకు రూ.7.74 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.3.27 కోట్లు వసూలు కావాల్సి ఉన్నది. జిల్లాలో వసూలు 70.29 శాతం నమోదు కాగా, 100 శాతం టార్గెట్ చేరుకునేందుకు అధికారులు పనిచేస్తున్నారు.

### గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించనున్న ఇంటి పన్ను...

పల్లెల్లో ఇంటిపన్నుల చెల్లింపులో ప్రజలు ముందుంటారు. పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీల అభివృద్ధిలో కీలక పాత్రను పోషిస్తున్నారు. గత పదేండ్లలో గ్రామాల్లో వచ్చిన ఊహించని మార్పులతో ఇంటి పన్ను కట్టేందుకు ప్రజలు చొరవ చూపిస్తున్నారు. అంతేకాకుండా అధికారులు సైతం గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

### వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటాం..



మార్చి నెలాఖరులోగా జిల్లాలో ఇంటి పన్ను వసూళ్లలో వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటాం. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.11 కోట్ల టార్గెట్ నిర్దేశించగా, ఇప్పటి వరకు రూ.7.74 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.3.27 కోట్లు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు 70.29 శాతం పన్ను వసూళ్లు అయ్యాయి. గ్రామ పంచాయతీ సిబ్బందికి టార్గెట్‌లు విధించి పన్నులు వసూళ్లు చేస్తున్నాం. గ్రామాల్లో ప్రజలు అధికారులు, సిబ్బందికి సహకరించాలి. పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలి.

– సాయిబాబా, జిల్లా పంచాయతీ అధికారి, మెదక్



# ఆధార్ అప్‌డేట్ గడువు పెంపు



**■ మార్చి14 వరకు పొడిగింపు ■ మార్పులు, చేర్పులకు అవకాశం**

మెదక్‌రూరల్, డిసెంబర్ 16: ఆధార్ అప్‌డేట్ గడువును మరోసారి పొడిగించారు. వయసు పెరుగుతున్నకొద్దీ వ్యక్తుల ముఖాల్లో తేడాలు వస్తుండడం సర్వసాధారణం. కాగా, ఆధార్ కార్డు వివిధ అవసరాలకు ప్రామాణికమవుతోంది. దీంతో వ్యక్తులను గుర్తించడం కష్టమవుతుండగా, అటు అధికారులు, ఇటు ఆధార్ కార్డులోని వ్యక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని పరిష్కరించే క్రమంలో ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తూ యూఐడీఏఐ అవకాశం కల్పించింది. గతేడాది డిసెంబర్ నుంచి మూడు మాసాల పాటు ఉచితంగా మార్పులు, చేర్పులు చేసుకోవచ్చంటూ ప్రకటించింది. అయితే కార్డుదారులు అంతగా ఆసక్తి కనబర్చకపోవడంతో ఆశించిన మేర మార్పులు చేసుకోలేదు. దీంతో ఈఏడాది మార్చి 14 నుంచి మరో మూడు నెలల పాటు అంటే జూన్ 14 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ప్రజల్లో కొద్దిమేర చైతన్యం రాగా, అప్‌డేట్ చేసుకునే వారి సంఖ్య క్రమేపి పెరిగింది. అయితే ఈలోపు గడువు సమీపించడంతో మరో మూడు మాసాలు పెంచుతూ ఈనెల 14వరకు అవకాశం కల్పించింది. అయినా, ఇంకా పదేళ్ల గడువు ముగిసిన వారు భారీ సంఖ్యలోనే ఉండడంతో మరోసారి మార్చి 14 వరకు గడువు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. గడువు ముగిసిన అనంతరం అప్‌డేట్‌తో పాటు ఫొటో, నివాసం, ఇతర మార్పులు, చేర్పులు చేసుకునేందుకు విధిగా రూ.50 చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

### ఉచితంగా ఆన్‌లైన్‌లో నమోదు

ఉచితంగా ఆన్‌లైన్ చేసుకునే విధానాన్ని ఒకసారి పరిశీలిస్తే.. ఉడాయ్ పోర్టల్‌లో https://myaadhaar.uidai.gov.in ఆధార్ నంబర్ ద్వారా లాగిన్ కావాలి. ప్రొసీడ్ టూ అప్‌డేట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఆధార్ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్‌చేసిన అనంతరం డాక్యుమెంట్ అప్‌డేట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. వివరాలు స్క్రీన్‌పై వస్తాయి. వాటిని పూర్తిగా పరిశీలించి, సవరణ ఉంటే చేయాలి. లేదంటే ఉన్న వివరాలతోనే నెక్ట్స్ పై క్లిక్ చేయాలి. కిందకు స్క్రోలింగ్ చేస్తే ప్రూఫ్ ఆఫ్ ఐడెంటిటీ, ప్రూఫ్ ఆఫ్ అడ్రస్ డాక్యుమెంట్లను ఎంచుకోవాలి. ఆయా డాక్యుమెంట్లను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. సబ్మిట్ బటన్‌పై క్లిక్ చేయాలి. పద్నాలుగు అంకెల అప్‌డేట్ రిక్వెస్ట్ నెంబర్ వస్తుంది. దీని ద్వారా స్టేటస్ తెలుసుకోవచ్చు.




# డ్రమ్‌సీడర్‌తో ఖర్చు ఆదా..

- నీటి పొదుపు, తక్కువ ఖర్చు
- కూలీల సమస్యకు చెక్

దుబ్బాక టౌన్, డిసెంబర్ 16 : డ్రమ్‌సీడర్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ సాగుతో నీటితో పాటు, కూలీల సమస్యను అధిగమించవచ్చని చెబుతున్నారు. సరైన పద్ధతులు పాటించడంతో అధిక దిగుబడి పొంది లాభాలు ఆర్జించవచ్చని సూచిస్తున్నారు. డ్రమ్‌సీడర్ ఉపయోగిస్తే సాలుకు సాలుకు మధ్య 20సెంటీ మీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 10సెంటీ మీటర్లు దూరం ఉండేట్లు విత్తుకోవాలని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల సాళ్ల మధ్య కలుపు తీసే యంత్రాన్ని నడిపి కలుపును భూమిలోకే కలియదున్ని మంచి ఫలితాన్ని పొందవచ్చు.

**పొలం తయారీ:** మొదట పొలంలో నీరు బాగా పెట్టి దున్ని నేలను చదును చేయాలి. విత్తనం విత్తే 24 గంటల ముందు పొలంలో నీరు తీసేసి నేలను చిక్కటి బురద పొరగా ఉండేలా చేసుకోవాలి. విత్తనం విత్తేముందు పొలంలో కాగితం పొర మందం నీరు ఉండేలా చూసుకోవాలి. విత్తనాలను 24 గంటల పాటు నీటిలో నానబెట్టాక 24గంటలు మండె కట్టాలి. విత్తనాల ముక్కులు పగిలి తెల్లగా మొలక కన్పించగానే విత్తుకోవాలి. తర్వాత మూడు రోజులకు ఒకసారి పొలంలో నీరు పెట్టి తీయాలి. ఈ పద్ధతిని 15 రోజుల పాటు పాటించాలి. ఆ తర్వాత మొలక ఎత్తును బట్టి నీరు పొలంలో తగిన మోతాదులో నిల్వ ఉంచుకోవాలి. ఈ పద్ధతిలో ఎకరానికి 12కిలోల విత్తనాలు సరిపోతాయి.

**యంత్రం ఉపయోగించే విధానం:** మొలకెత్తిన విత్తనాలను 2/3 వంతు డ్రమ్ములో నింపాలి. డ్రమ్ మూతను మూసివేసి లాక్ చేయాలి. డ్రమ్ సీడర్‌ను సాధారణంగా మనిషి నడిచే వేగంతో పొలంలో ఒక అంచు నుంచి సమానంగా లాగాలి. డ్రమ్‌సీడర్ రెండోగాడిని కొలమానంగా నిర్ణయించుకుని రెండోసారి డ్రమ్‌సీడర్ లాగేటప్పుడు మొదటి చక్రం డ్రమ్‌సీడర్ గాడిలో నడిపించాలి. తద్వారా సాళ్లు తేడా లేకుండా వస్తాయి. ఇలా పోవడం వల్ల సాలుకు సాలుకు మధ్య 20సెంటీ మీటర్లు ఎడం ఉంటుంది. డ్రమ్‌సీడర్ రంధ్రాలతో వచ్చే విత్తనాలు సమానంగా పడుతున్నాయో లేదో అప్పుడప్పుడు పరిశీలించుకోవాలి. డ్రమ్ సీడర్‌లో విత్తన మోతాదు లెవల్ 1/4 వరకు వచ్చినప్పుడు తిరిగి విత్తనాలను నింపాలి.

**ప్రయోజనాలు:** కూలీల ఖర్చు ఉండదు విత్తనాలు సమానంగా విత్తితే మొక్కల సాంద్రత సమానంగా ఉంటుంది. విత్తన మోతాదు 50శాతం తగ్గుతుంది. పంట 10రోజుల ముందు పక్వతకు వస్తుంది. ఇద్దరు వ్యక్తులు రోజుకు రెండెకరాల్లో విత్తుకోవచ్చు. డ్రమ్‌సీడర్‌తో ఖర్చు తక్కువగా రావడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చు.



పొలంలో డ్రమ్ సీడర్ లాగుతున్న రైతు